RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 21 జూలై 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:45

# క్యూర్ పరిధిలో కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తాం

**తొలివిడతలో 16 నియోజకవర్గాల్లో 8వేల ఇళ్లు**

**జూలై 21 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**త్వరలో మరో 8 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు**

**ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇళ్ల మంజూరులో రిజర్వేషన్**

**ఒక్కో ఇంటికి రూ.11 లక్షలు,రూ.5లక్షలు ప్రభుత్వ సబ్సిడీ**

**రూ.40-60 లక్షల విలువచేసే స్థలం లబ్దిదారునిపేరిట ఉచిత రిజిస్ట్రేషన్**

**లబ్దిదారుని వాటా రూ.6 లక్షలు,లినాలుగు విడతల్లో చెల్లింపు సౌకర్యం**

**త్వరలో మధ్యతరగతి ప్రజలకు శుభవార్త ,మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైరాబాద్ :- హైదరాబాద్ ప్రాంతంలోని క్యూర్ పరిధిలో తొలి విడతగా 16 నియోజవర్గాల్లో ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తున్నామని, త్వరలో మరో 8 నియోజకవర్గాలలో కూడా ఈ పథకం అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పేదవాడి సొంతింటి కల నెరవేరేవరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం కొనసాగుతుందని, చివరి లబ్దిదారునికి ఇల్లు అందేవరకు కొనసాగుతుందని , ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.

సోమవారం నాడు సచివాలయంలో సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులతో కలిసి క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ , మీసేవ, వాట్సాప్ దరఖాస్తు లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరును ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సహేతుకంగా వివరించిన నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామానికి చెందని కొండా నాగరాజుకు లక్ష రూపాయిల నగదు బహుమతిని అందజేసి మంత్రులు సత్కరించారు.

ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలివిడతగా 4.50 లక్షల ఇళ్ల మంజూరు చేయగా రెండవ విడతలో 2.50 లక్షల ఇళ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని ఇప్పుడు క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు ప్రారంభిస్తూ 8లక్షల ఇళ్లు పేదలకు అందిస్తున్నామని అన్నారు. వచ్చే నెలలోగా రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తికానున్నాయని అన్నారు.

గత పాలకులు పనికిరాని ఆలోచన కారణంగా ఎన్నికల సమయంలో హైదరాబాద్‌కు 30-35 కిలోమీటర్ల దూరంగా ఇళ్ళను నిర్మించడం వలన కేవలం 8-9 వేల మంది మాత్రమే నివాసాల్లో దిగారని , మిగిలిన వారు మంజూరు పత్రాలు తీసుకున్నారే తప్ప దిగలేదన్న విషయం తమ పరిశీలనలో వెల్లడైందన్నారు.

ఈ పరిస్థితుల్లో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాం.

పేదల నివాస ప్రాంతాల్లోనే 525 చదరపు అడుగుల వైశాల్యంతో సుమారు 40-60 లక్షల రూపాయిల విలువ కలిగిన స్థలాలను ఆడపడుచుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని తెలిపారు. దీనిని పదేళ్ల వరకు అమ్ముకునే అవకాశం ఉండదని, అయితే బ్యాంకులో రుణం కోసం తనఖా పెట్టుకోవచ్చునని తెలిపారు. ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ ఉంటుందన్నారు

ఒకవేళ ఇల్లు మంజూరు కాకపోతే కట్టిన రూ.10 వేల రూపాయిలు తిరిగి చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల రూపాయిలను ఉచితంగా ఇస్తుందని, ఒక్కో ఇంటి నిర్మాణానికి 11 లక్షల రూపాయిల వరకు ఖర్చు అవుతున్నందున లబ్దిదారుల నుంచి మిగిలిన ఆరు లక్షల రూపాయిలను నాలుగు వాయిదాల్లో తిరిగి తీసుకుంటామని , ఆ మొత్తంలో ఈ 10 వేల రూపాయిలను మినహాయిస్తామని మంత్రి గారు తెలిపారు.

ఏనియోజకవర్గ ప్రజలు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి స్థలాలను ఎంపిక చేయడం జరిగింది. ఈనెల 21వ తేదీ నుంచి మీసేవ, వాట్సాప్ ( నెంబర్ 8096958096), వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

లబ్దిదారుని కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6లక్షల వరకు ఉండాలని, దరఖాస్తు దారుని పేరిట క్యూర్ పరిధిలో స్థలం గానీ, స్వంత ఇల్లుకానీ ఉండకూడదన్నారు. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తారని. అర్హత బట్టి కేటాయింపు జరుగుతుందన్నారు. 360 డిగ్రీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వడపోత జరుగుతుందని, అప్పటికీ ఎక్కువ దరఖాస్తులు వస్తే అందరి ముందూ బహిరంగంగా లాటరీ తీసి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద ప్రతిపాదించిన 525 చదరపు అడుగుల ఫ్లాట్ లో ఒక బెడ్ రూమ్, హాల్, కిచెన్ ఉంటాయన్నారు.

హైదరాబాద్ లోప్రస్తుతం జరుగుతున్న బోనాల జాతర శుభ సందర్భంలో క్యూర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వచ్చే ఏడాది క్యూర్ పరిధిలో కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలు శరవేగంగగా పూర్తి చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా పేదవాని సంక్షేమం విషయంలో ఏమాత్రం రాజీ పడడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని బట్టి ప్రతిసోమవారం చెల్లింపులు జరుపుతున్నాం. ఈ ప్రభుత్వం పేదవాని గురించే కాకుండా మధ్యతరగతి ప్రజానీకం గురించి కూడా ఆలోచన చేస్తోంది. ఇళ్ల విషయంలో త్వరలో మధ్యతరగతి ప్రజానీకానికి కూడా శు భావార్త అందిస్తామన్నారు.

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఒక చారిత్రాత్మక కార్యక్రమని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకుంటున్నామని ఉచిత బస్సు, ఉచిత కరెంట్, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడం శుభపరిణామం అన్నారు.

మిగతా 2లో




## వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతుల ఆదాయం పెరుగుతుంది..

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ఖమ్మంలో మరిన్ని అగ్రో ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం**

**విలువ ఆధారిత వ్యవసాయంతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి**

**కొణిజెర్లను పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతాం**

**దేశంలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్**

**ప్రతి 10 వేల ఎకరాలకు ఒక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు లక్ష్యం**

**సీడ్ గార్డెన్‌తో దేశానికే ఖమ్మం కేంద్రంగా మారుతుంది**

**గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ సీఎం**

వార్తా 4 లో



ప్రజాబలం

21 జూలై 2026 మంగళవారం

# భార్యల చేతిలో భర్తల ‘బలి’.

దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న ‘ఏకం న్యాయ్ ఫౌండేషన్’ నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది.ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది.అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది.రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది.అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీగ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి.వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటాయని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది.ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

# “ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!”

**“కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్”**

**దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం అందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**









టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు ‘చేయూత’ కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 (తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల) భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

ఆ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు.

గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు.

కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు.

కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు వీమీూ సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

సంస్థ అభివృద్ధికి ఉద్యోగుల క్రమశిక్షణ, సేవాభావం, టీమ్‌వర్క్ అత్యంత అవసరమని, ప్రతి ఉద్యోగి సంస్థ ప్రతిష్ఠను పెంచేలా ప్రజలకు సేవలు అందిస్తే టీజీఎస్ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శవంతమైన ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతుందని ఎండీ నాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దివంగత కోల శంకర్ సతీమణి హేమలత మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని నిలబెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న తన భర్త శంకర్‌గౌడ్ కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (EDs) సిహెచ్. వెంకన్న, రాజశేఖర్, సోలోమన్, ఏచూరి శ్రీధర్, ఫైనాన్షియల్ అడ్వైజర్ (ఫీూ) శ్రీమతి విజయపుష్ప, సీపీఎం శ్రీమతి ఉషాదేవి, సిటీఎం శ్రీమతి శ్రీదేవి, సీసీఓఎస్ శ్రీమతి ప్రభులత, సీఎంఈ జనీరెడ్డి, ఆర్టీసీ యూనియన్ నాయకులు, పలువురు ఉన్నతాధికారులు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్యూర్ పరిధిలో కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తాం





మొదటి పేజీ తరువాయి

ఇళ్ల నిర్మాణాలు చేపట్టే నియోజకవర్గాలు:

రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి;

మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలోని జల్‌పల్లి;

శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని రాయదుర్గం;

ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని తట్టిఅన్నారం, బండ్లగూడ;

మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని కౌకూర్;

నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్ మరియు నీలోఫర్ ఆసుపత్రి సమీప పోలీస్ క్వార్టర్స్;

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హకీంపేట్ దర్గ మరియు జూబ్లీహిల్స్, ఎమ్మెల్యేకాలనీ

కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కుల్సుంపురా సమీప పోలీస్క్వార్టర్స్;

బహదూర్‌పురా అసెంబ్లీ నియోజకవర్గంలోని నందిముసలిగూడ;

అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సిటీపోలీస్ లైన్స్

కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీకాలనీ;

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోచారం ఎల్‌ఐజీకాలనీ;

కుత్బుల్లాపూర్ అసెం బ్లీ నియోజకవర్గంలోని గాజులరామారం;

సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పాటిగడ్డ;

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మారేడ్‌పల్లి--మహేంద్రహిల్స్;

మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని గడ్డిఅన్నారం ఆర్‌అం డ్ బీ క్వార్టర్స్. ఉన్నాయి

ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, శాసనసభ్యులు దానం నాగేందర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేష్ , ప్రకాష్ గౌడ్, శ్రీగణేష్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహినుద్దీన్ ,జుల్ఫికర్ అలీ, జాఫర్ హుస్సేన్, ముబీన్, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి. గౌతమ్, కలెక్టర్ ప్రియాంక ఆల, కమీషనర్లు పాల్గొన్నారు.

# తెలంగాణాలో పెరిగిన వర్షాభావ పరిస్థితులు

## (సి.హెచ్.ప్రతాప్)

తెలంగాణలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. జూన్ నుంచి జూలై మధ్యకాలం వరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 33 శాతం లోటు నమోదవడం, వందలాది మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొనడం రైతాంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. పలు జిల్లాల్లో చెరువులు, కుంటలు నిండకపోవడం, భూగర్భ జలాలు క్షీణించడం, జలాశయాల్లో నిల్వలు తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.

వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాలపై ఆధారపడి విత్తనాలు వేశారు. అయితే వర్షాలు ఆలస్యం కావడం వల్ల మొలకలు దెబ్బతినడం, పంటల ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, పత్తి వంటి పంటల సాగు మరింత సవాలుగా మారుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది.

వర్షాభావం వ్యవసాయానికే పరిమితం కాదు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పశువులకు మేత, భూగర్భ జలాల లభ్యత వంటి అంశాలపై కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. బోర్లు మరింత లోతుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నీటి వినియోగంలో మితవ్యయం పాటించాల్సిన అవసరం మరింత స్పష్టమవుతోంది.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళిక కూడా అవసరం. ప్రతి గ్రామంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, కుంటలు, కాలువల పూడికతీతను వేగవంతం చేసి, వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసే వ్యవస్థలను బలోపేతం చేయాలి. పట్టణాల్లోనూ వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను తప్పనిసరి చేయడం వల్ల భూగర్భ జలాలు పునరుద్ధరించబడతాయి.

వ్యవసాయ రంగంలో సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను విస్తృతంగా ప్రోత్సహించాలి. తక్కువ నీటితో సాగయ్యే పంటలపై రైతులకు అవగాహన కల్పించడం, వాతావరణ అంచనాల ఆధారంగా సాగు ప్రణాళికలు రూపొందించడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. శాస్త్రీయ సలహాలు రైతులకు సకాలంలో అందితే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు.

వర్షాభావం ప్రకృతి సవాలే అయినప్పటికీ, దానిని సమర్థవంతమైన ప్రణాళికతో ఎదుర్కోవడం మన చేతుల్లోనే ఉంది. ప్రతి నీటి బొట్టును విలువైన వనరుగా భావించి సంరక్షిస్తే భవిష్యత్తులో కరవు ప్రభావాన్ని తగ్గించవచ్చు. తెలంగాణకు తాత్కాలిక ఉపశమనం వర్షాలైతే, శాశ్వత భద్రత మాత్రం నీటి సంరక్షణ, సమర్థ వినియోగం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారానే సాధ్యమవుతుంది.

# డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోఉచిత ఆరోగ్య శిబిరం



హైదరాబాద్ జులై 20;: ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (IIMC) కళాశాలలో ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.

ఈ శిబిరంలో సుమారు 600 మంది విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు మరియు రక్త గ్రూపింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.



నిపుణులైన వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత సూచనలు అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి, కంటి సంరక్షణ, నోటి పరిశుభ్రత మరియు రక్త గ్రూప్ తెలుసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎక్సగ్యుటీ డైరెక్టర్ జి.మాధవి మాట్లాడుతూ, యువత ఆరోగ్య పరిరక్షణే సమాజ అభివృద్ధికి పునాది అని, విద్యార్థుల కోసం ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను భవిష్యత్తులో కూడా వివిధ విద్యాసంస్థల్లో నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ యాజమాన్యానికి, అధ్యాపకులకు, వైద్య బృందానికి, వాలంటీర్లకు మరియు పాల్గొన్న విద్యార్థులందరికీ ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేషన్పదవుల్లో శ్రీ వైష్ణవులకు ప్రాధాన్యం కల్పించాలి



హైద్రాబాద్ జులై 20;రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివర్లో భర్తీ చేయనున్న కార్పొరేషన్ చైర్మన్,మరియు డైరెక్టర్స్ పదవులలో "శ్రీ వైష్ణవ" అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించి,తగు న్యాయం చేయాలని కోరుతూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి,శ్రీ వైష్ణవసేవా రాష్ట్ర సంఘం పక్షాన వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ మెసల్లడుతూ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ పదవులను రెండింటిని వైదికుల (బ్రాహ్మణుల) చేతనే భర్తీ చేయడం ద్వారా " శ్రీ వైష్ణవులకు " తీవ్ర అన్యాయం జరిగిందని టిలిపారు.బ్రాహ్మణ పరిషత్ డైరెక్టర్స్ నియామకాలు ఈ నెల చివరిలో భర్తీ చేసే సందర్భం లో కనీసం 5 డైరెక్టర్స్ పదవులను " శ్రీ వైష్ణవులకు " కేటాయించాలని డిమాండ్ చేశారు.

వైష్ణవ ఆలయాలలో నిత్యం అనుసరించే వైష్ణవ ఆగమం గూర్చి సంపూర్ణంగా అవగాహన కలిగిన శ్రీ వైష్ణవులను పాలకవర్గ సభ్యులుగా నియమించడం ద్వారా,సదరు ఆలయాలలో పూజాది కార్యక్రమాలు సజావుగా సాగేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ లో సుదీర్ఘ కాలంగా సేవ చేస్తున్న శ్రీ శ్రీనివాసా చారికి తగు అవకాశం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమం లో ,రాష్ట్ర బాధ్యులు శ్రీ సుదర్శనా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై మాజీ సైనికులు పోరాడాలి

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపు

హైదరాబాద్ జులై20: సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపైమాజీ సైనికులు పోరాడాలని, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపు నిచ్చారుబిజెపి రాష్ట్ర ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ ప్రతినిధుల సమావేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ రాంచందర్ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సరిహద్దుల్లో దేశాన్ని రక్షించిన మాజీ సైనికులు, రిటైర్మెంట్ తర్వాత సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై పోరాడాలని, సైనిక క్రమశిక్షణతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో తొలిసారిగా ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ ప్రతి జిల్లా నుంచి కన్వీనర్లతో బలమైన





టీమ్‌లను ఏర్పాటు చేసుకుని, పార్టీలో అత్యంత క్రియాశీలక వింగ్‌గా రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. న్యాయవాదులకు లీగల్ సెల్, కార్మికులకు లేబర్ సెల్ ఎలాగైతే పనిచేస్తాయో, ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ కూడా దేశ సరిహద్దుల్లో సేవలు అందించిన సైనికులకు అండగా ఉంటుందని అన్నారు. కలెక్టరేట్లలో ఉండే రిటైర్డ్ ఎంప్లాయీస్ బోర్డులు సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి, దేశ సమస్యలపై స్పందించడానికి ఈ సెల్ చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాబోయే జూలై 26న 'కార్గిల్ విజయ్ దివస్'ను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని రాంచందర్ రావు సూచించారు. క్లిష్టమైన కొండప్రాంతాల్లో శత్రువులను ఎదుర్కొని దేశమాతను రక్షించిన సైనికుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, నాటి ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయీ నేతృత్వంలో సాధించిన విజయాన్ని స్మరిస్తూ ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సరిహద్దుల్లో పనిచేసే సైనికుల నిబద్ధతను గుర్తుచేస్తూ, వన్ ర్యాంక్ - వన్ పెన్షన్ సిఫార్సుల కోసం వేసిన జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్‌ను బిఎస్ఎఫ్ సైనికులు కలిసినప్పుడు జరిగిన ఒక నిజ జీవిత సంఘటనను ఆయన పంచుకున్నారు. సరిహద్దుల్లో విపరీతమైన వేడిని తట్టుకోవడానికి తమ జీతాలు లేదా పెన్షన్ల పెంపును కోరకుండా, కేవలం రేషన్‌లో "అరకిలో ఉల్లిగడ్డలు" పెంచమని మాత్రమే వారు వేడుకున్నారని గుర్తుచేశారు. డబ్బులు, ప్రమోషన్లు కాకుండా దేశ సేవ, ఆరోగ్యాన్నే ప్రాధాన్యంగా భావించే సైనికుల త్యాగనిరతి మనందరికీ ఆదర్శనీయమని కొనియాడారు.

గత 12 ఏళ్ల ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పాలనలో భారత్ "సురక్షిత భారత్"గా మారిందని, 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా రక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాంచందర్ రావు స్పష్టం చేశారు. 2014లో రూ. 686 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు నేడు రూ. 38,400 కోట్లకు పెరిగాయని, రక్షణ బడ్జెట్ రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 8 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. అలాగే రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 46,000 కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెరిగిందని, ఆర్డినెన్స్ నిల్వల స్వయంసమృద్ధి 32% నుంచి 90%కి చేరుకుందని తెలిపారు. నేవీ, కోస్ట్ గార్డ్ నౌకల్లో 97% మేడ్ ఇన్ ఇండియా పరికరాలే ఉపయోగిస్తున్నామని, తేజాస్ యుద్ధ విమానాలు, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటివి భారత రక్షణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదంపై "చర్చలు" మాత్రమే ఉండేవి కానీ, ఇప్పుడు "చర్చలు లేవు - కేవలం చర్యలే" అనే విధానంతో ఉరి సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా సత్తాచాటిన భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఆవిర్భవించిందన్నారు.

సైన్యంలో ఉన్నప్పుడు యూనిఫామ్‌లో దేశాన్ని కాపాడిన సైనికులు, రిటైర్మెంట్ తర్వాత కూడా సమాజంలోని అవినీతి,అన్యాయాలపై పోరాడి దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సైనిక క్రమశిక్షణతో పనిచేస్తూ అందరూ కలిసికట్టుగా పనిచేసి తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

# సదాశివపేట లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

## సదాశివపేట పట్టణం లో ఇస్కాన్ ఆధ్వర్యం లో వైభవంగా జగన్నాథ రథయాత్ర



సదాశివపేట జులై 20 అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర సదాశివపేట దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారయణ, పృథ్వీ రాజ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతుల ఆదాయం పెరుగుతుంది..





**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై20 ప్రజాబలం:** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు.

అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్, థర్మల్ పవర్ స్టేషన్, నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవని, జిల్లా పునర్విభజన తర్వాత ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడుతోందన్నారు. పాలేరు జలాశయం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమని పేర్కొన్నారు.

రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లడం అవసరమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ. 52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆయిల్ పామ్ సాగు నిలకడైన దిగుబడిని అందిస్తుందని చెప్పారు.

దేశంలో వంటనూనెల అవసరం ఎక్కువగా ఉన్నదని, దేశీయ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 మిలియన్ టన్నుల వంటనూనె దిగుమతుల కోసం రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు. 1991-92లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దేశ అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12 వేలుగా ఉండగా ప్రస్తుతం సుమారు రూ.23 వేలకు చేరడం రైతులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. వంట నూనెతో పాటు సౌందర్య సాధనాల పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను కూడా ఆయిల్ పామ్ ద్వారా అందించవచ్చని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ఈ సమీకృత పరిశ్రమ ఏర్పాటవడం రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ పరిశ్రమ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేశారని ప్రత్యేకంగా అభినందించారు. గోద్రెజ్ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు.

ఈ పరిశ్రమకు అవసరమైన రహదారి మౌలిక సదుపాయాలను టీజీఐఐసీ ద్వారా త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడి రైతులు పండించే పంటలకు స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. దీని వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

ఈ సమీకృత ప్రాజెక్టులో సీడ్ గార్డెన్, మిల్లింగ్ యూనిట్, రిఫైనరీ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమన్నారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత పరిశ్రమ గంటకు 60 నుంచి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. గోద్రెజ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మిర్చి, పత్తి, వరి ఆధారిత పరిశ్రమలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు.

రైతులు వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి సుమారు రూ.17 లక్షల కోట్లు ఉండగా, వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటలు, విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు.

ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు. నాగార్జునసాగర్, కృష్ణా జలాలు, సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్, ఎన్కూరు--రాజీవ్ లింక్ కాలువల ద్వారా లభించే నీటిని వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు.

కొణిజెర్ల మండలం భవిష్యత్తులో రాష్ట్రం లోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాలు అందించే స్థాయికి ఈ కేంద్రం ఎదగాలని అన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలపై ప్రతి గ్రామంలో రైతులతో చర్చలు నిర్వహించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని, దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్ పామ్ సాగు, నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రానున్న 2 నుంచి 3 సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవసరమని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని ఆయిల్ పామ్ సాగులో దాదాపు 90 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతోందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పనిచేస్తుండగా, గోద్రెజ్ ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ నాలుగో ఫ్యాక్టరీ అని తెలిపారు.

దేశంలో ఇప్పటి వరకు ఆయిల్ పామ్‌కు ప్రత్యేక సీడ్ గార్డెన్ లేకపోవడం గమనార్హమని, గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో ఖమ్మంలో దేశంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధన కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణా కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు కూడా నేటి నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.

ఈ సమీకృత ఆయిల్ పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడు తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల సందేహాల నివృత్తి, శాస్త్రీయ సాగుపై మార్గదర్శకాలు, నాణ్యమైన మొక్కలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులు, అవసరమైన సాంకేతిక సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే ఎకరాకు 15 నుంచి 16 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలల దిగుబడి సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో త్వరలోనే మరో ఆరు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో పంటల వైవిధ్యీకరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దక్షిణ భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే ఉత్తమ ప్రత్యామ్నాయమని వివరించారు.

ఆయిల్ పామ్ రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అనేక మంది రైతుల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడి, వారిపిల్లలు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే స్థాయికి ఎదిగారని అన్నారు. ఇతర ఏ పంటతోనూ పోల్చలేనంత ఆదాయం ఆయిల్ పామ్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. తాను కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతునేనని గుర్తు చేశారు.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. ఏ జిల్లాలోనైనా 10 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగు ఉంటే అక్కడే ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెంచాలని, అలాగే దిగుమతులపై సుంకాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో కంది, పత్తి, పప్పు ధాన్యాలు వంటి అంతర పంటలను విజయవంతంగా సాగు చేయవచ్చని చెప్పారు. తద్వారా రైతులకు ప్రారంభ సంవత్సరాల్లోనే అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఖమ్మం జిల్లా దేశానికే స్ఫూర్తిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం, యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

గోద్రెజ్ సంస్థ మరో పరిశ్రమను కూడా ఖమ్మంలో ఏర్పాటు చేయాలనుకుంటే అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధే తెలంగాణ రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందని, ఖమ్మం జిల్లా దేశంలోనే ఆయిల్ పామ్ రంగానికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-- 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసిందని తెలిపారు. ఆ విజన్‌కు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించామని, ప్రస్తుతం సుమారు 40 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ రంగ ఆర్థిక విలువను 2047 నాటికి 400 బిలియన్ డాలర్లకు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం 3.36 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, గత మూడు సంవత్సరాల్లోనే 2 లక్షల ఎకరాల కొత్త విస్తీర్ణం ఆయిల్ పామ్ సాగులోకి రావడం దేశంలోనే అత్యధికమని తెలిపారు. గోద్రెజ్ సంస్థకు ఖమ్మం జిల్లాలో 113ఎకరాల భూమిని కేటాయించి, అవసరమైన అన్ని అనుమతులను వేగవంతంగా మంజూరు చేయడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం సాధ్యమైందన్నారు.

గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మెన్ నాదిర్ బి. గోద్రెజ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం జాతీయ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో తెలంగాణ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

ఆయిల్ పామ్ సాగు విస్తరణలో మహిళలు మరింత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతు కుటుంబాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం మరింత పెరిగి, దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యం వేగంగా నెరవేరుతుందని పేర్కొన్నారు.

గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ దేశ వ్యాప్తంగా ఆయిల్ పామ్ రంగంలో పని చేస్తోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, దేశంలోని ప్రముఖ ఆయిల్ పామ్ సంస్థల్లో ఒకటిగా గోద్రెజ్ ఎదిగిందని తెలిపారు. భారత్ ఇప్పటికీ వంటనూనెల అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడుతోందని, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వేగంగా ఎదుగుతున్న రాష్ట్రంగా నిలిచిందని కొనియాడారు.

తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఖమ్మం జిల్లాలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే ప్రాంగణంలో త్వరలోనే ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీకృత ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.

నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కల ఉత్పత్తి కోసం ఖమ్మంలోనే సీడ్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు మెరుగైన నాణ్యత గల నాట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆయిల్ పామ్ సాగు మరింత విస్తరించేందుకు సంస్థ కృషి చేస్తుందని చెప్పారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ అంజనాపురంలో సమీకృత ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. గత 30 సంవత్సరా లుగా ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటూ వచ్చారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమై, నేడు పూర్తై ప్రారంభోత్సవం జరగడం ఈ ప్రాంత ప్రజల కల సాకారమైన రోజుగా అభివర్ణించారు.

గోద్రెజ్ సంస్థ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంత యువత ప్రతిభావంతులు, నైపుణ్యం కలిగిన వారని, వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సర్పంచ్ లు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయిల్ పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య ప్రయత్నం చేసిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమిలో శిక్షణలో వున్న ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. ఎర్రగడ్డ మోతీనగర్ లోని సోదరుడి ఇంట్లో ఆత్మహత్య యత్నం చేయడంతో ఎస్సార్ నగర్లోని హాస్పిటల్ కు కుటుంబ సభ్యులు తరలించారు. ఆదివారం కృష్ణారెడ్డిపై సహచర ట్రైనీ ఐపీఎస్ తనపై లైంగిక వేధింపులకు ఫిర్యాదు చేసింది. మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసారు. దీంతో తీవ్ర డిప్రెషన్ కు గురైన కృష్ణారెడ్డి, అదే స్థితిలో సోదరుడి ఇంటికి వెళ్ళి ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం.

# పదో తరగతి విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, జూలై 20:** విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు హాజరై ప్రణాళిక ప్రకారం చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించగలరని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే రెసిడెన్షియల్ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల వంటశాలను పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతతో పాటు మెనూ చార్ట్ ప్రకారం భోజనం సిద్ధం చేస్తున్నారా అనే విషయాన్ని



పరిశీలించారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో బియ్యం, పప్పులు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తదనంతరం పదో తరగతి విద్యార్థులతో సమావేశమైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, ప్రతి విద్యార్థి రోజూ తరగతులకు హాజరై ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. చదువుతో పాటు ప్రతిరోజూ కొంత సమయం ఆటలకు కేటాయించాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భోజనం చేసే ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## చిన్నారులను ఆశీర్వదించిన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

### కార్యక్రమం పాల్గొన్న మండల నాయకులు.




**ఖమ్మం/తల్లాడ జూలై20 ప్రజాబలం:** మండల పరిధిలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఎక్కిరాల రామకృష్ణ జ్యోతి దంపతుల ఆహ్వానం మేరకు వారి చిన్నారుల నూతన వస్త్రాలంకరణ వేడుకలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని అక్షింతలు వేసి దీవించారు.

ఈ సందర్భంగా చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కుటుంబం ఆనందం, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలఅధ్యక్షులు వీర మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దుగ్గుదేవర వెంకటలాల్, సత్తుపల్లి మాజీ బీసీ సెల్ అధ్యక్షులు కోడూరు వీర కృష్ణ, జూనియర్ కేసీఆర్, సీనియర్ నాయకులు ఇసినేపల్లి వీరయ్య,వార్డ్ మెంబర్లు దుర్గారావు, కోడూరు నాగన్న, బొగ్గుల కృష్ణారెడ్డి, కోడూరు సత్యనారాయణ, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మల్లాపూర్ యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

**టీబీ, ఎన్‌సీడీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిలి**

**వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దులి**

**ఆరోగ్య సేవల్లో నాణ్యత పెంచాలి: డీఎంహెచ్‌వో డా. కె. ఆనంద్**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 20:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ సోమవారం మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య



కేంద్రం (యూపీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు.

ఈ సందర్భంగా మాతా--శిశు ఆరోగ్య (ఎంసీహెచ్) కిట్ల పంపిణీ, వాటి వినియోగాన్ని పరిశీలించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని సమీక్షించి, నమోదైన టీబీ రోగులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను పరిశీలించారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి, డీబీటీ ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమం పురోగతిపై ఆరా తీసిన డీఎంహెచ్‌వో, స్క్రీనింగ్ లక్ష్యాలను పెంచి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్)ను తనిఖీ చేసి, వ్యాక్సిన్ల నిల్వ, ఉష్ణోగ్రత నిర్వహణ, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కోల్డ్ చైన్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను నాణ్యంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని డా. కె. ఆనంద్ సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు

## పెంచాలి: డీఈవో



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 20:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో 2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో ఇప్పటివరకు నమోదైన విద్యార్థుల ప్రవేశాలు, ఇంకా ప్రవేశాలు పెంచాల్సిన పాఠశాలల వివరాలను సమీక్షించారు. ప్రవేశాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

# సదాశివపేటలో వైభవంగా జగన్నాథ

## రథయాత్ర...

### జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/**అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది,ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై



పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు,ఈ రథయాత్ర సదాశివపేట దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్,గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది,రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు,యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి,భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు,సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ,ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు,ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు,సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ,నాయకులు సత్యనారయణ,పృథ్వీ రాజ్,ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా

## రెండోసారి బొర్రా ప్రవీణ్ యాదవ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/భారతీయ జనతా యువ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బొర్రా ప్రవీణ్ యాదవ్ ను నియమించారు,ప్రవీణ్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి రెండోసారి ఈ బాధ్యతను అప్పగించిన భారతీయ జనతా పార్టీ అధి నాయకత్వానికి మరియూ బీజేవైఎం రాష్ట్ర నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను,ఈ గౌరవప్రదమైన అవకాశాన్ని కల్పించిన సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు గోదారి అంజిరెడ్డికి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుకి,ఎమ్మెల్సీ అంజిరెడ్డికి,బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావుకి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుందుకి, అలాగే సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో ప్రాతినిధ్యం వహిస్తూ నా ఎంపికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను,ఈ నియామకం నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, సంగారెడ్డి జిల్లా యువతపై పార్టీ ఉంచిన విశ్వాసానికి ప్రతీకగా భావిస్తున్నాను. ఈ బాధ్యతను మరింత జవాబుదారీతనంతో నిర్వర్తిస్తూ పార్టీ ఆశయాలను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను,భారతీయ జనతా యువ మోర్చా సిద్ధాంతాలకు అనుగుణంగా యువతను జాతీయవాద భావజాలం వైపు చైతన్యపరుస్తూ, యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తాము. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో బీజేవైఎం సంస్థాగత బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి యువశక్తిని పార్టీ అభివృద్ధికి వినియోగిస్తాము రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలు, యువత, రైతులు, నిరుద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల తరఫున బలంగా పోరాటం చేస్తాము. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాము,పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతను పదవిగా కాకుండా ప్రజాసేవకు దక్కిన అవకాశంగా భావిస్తూ, కార్యకర్తలందరినీ కలుపుకొని బీజేపీ, బీజేవైఎం బలోపేతం కోసం అంకితభావంతో నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను అని అన్నారు.

# కరిపే శంకర్ వంజరి ఆధ్వర్యంలో SIR హెల్ప్ డెస్క్: ప్రజల నుండి విశేష స్పందన








వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్ (SIR) హెల్ప్ డెస్క్ కేంద్రం అవగాహన కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. ఉప్పల్ అసెంబ్లీ నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి గారి ప్రత్యేక సహకారంతో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరిపే శంకర్ వంజరి గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా కామాక్షి పురంలోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద ఈ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్ కేంద్రానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కేంద్రం ద్వారా లబ్ధిదారులకు, స్థానికులకు ప్రభుత్వ పథకాల దరఖాస్తుల ప్రక్రియ, ప్రజా సమస్యల నమోదు, ఇతర సాంకేతిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి అందించారు. ల్యాప్‌టాప్‌లు, అవసరమైన పత్రాలతో సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలు చేకూర్చారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కరిపే శంకర్ వంజరి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో ప్రజలకు నిరంతరం సేవలందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ సార్ హెల్ప్ డెస్క్ సహాయ కేంద్రాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరిపే శంకర్ సేవలకు ప్రజల అభినందనలు.. డివిజన్ వ్యాప్తంగా ప్రజల సమస్యలపై నిత్యం స్పందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్న కరిపె శంకర్ వంజరి సేవలను స్థానికులు కొనియాడారు. ఆయన పట్ల ప్రజలు ప్రత్యేక అభినందనలు కురిపించారు.రాబోయే రోజుల్లో ఆయనకు కార్పొరేటర్ అభ్యర్థిగా అవకాశం వస్తే, భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్థానిక కాలనీ వాసులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్ పాషా, శ్రీనివాస్ గుప్త, మాజీ ఎన్ ఎస్ యు ఐ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కరిపే పవన్ కుమార్, వసంత, శిరీష, సిద్దన్న, జాంగిర్, నూరు, భానుక సంతోష్, రాజేష్ మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత సిపిఆర్ పై జిల్లా రవాణా శాఖ అధికారి సదస్సు.




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై20 ప్రజాబలం:** మహబూబాబాద్ పట్టణంలోని వీ.ఆర్.ఎన్ గార్డెన్ లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాల యజమానులు డ్రైవర్ లకు డిఫెన్సివ్ డ్రైవింగ్, విద్యార్థుల భద్రత, సీపీఆర్ పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖ అధికారి బీ. శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బస్ డ్రైవర్ల పత్తి పట్ల ప్రమాదంగా ఉండాలని, డ్రైవర్లను విధులకు తగ్గట్టుగా పిల్లలు పట్ల శ్రద్ధ వహించాలని, బస్ డ్రైవర్లు తమ విధులలో జాగ్రత్త వహిస్తూ పిల్లలను వారి గమ్యం స్థానాలకు సురక్షితంగా చేర్చాలని, డ్రైవర్లకు స్కూలు యాజమాన్యాలకు, తగు సూచనలు చేశారు, పిల్లలకు సిపిఆర్ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యకాంబ్రం, జిల్లా కార్యదర్శి అప్పారావు, ట్రాఫిక్ ఎస్.ఐ అరుణ్ కుమార్ స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారిని అభినందించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి మాల్వే విహాన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా విహాన తన తల్లిదండ్రులు రామేశ్వర్, అశ్విని తో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు,చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి సంగారెడ్డి జిల్లాకు,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు,భవిష్యత్తులోనూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాధించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, వసంత్ రెడ్డి తదితరులు పాల్గొని చిన్నారిని అభినందించారు.

# తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించాలి...

## రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు,సంగారెడ్డి,మెదక్ జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు,సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు,ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్,సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు,ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు,లోటు వర్షపాతం,నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు,వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు,రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు,రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు,అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు,జిల్లాలలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్యలు చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అన్నారు,ఎల్-నినో ప్రభావం తీవ్రత పెరిగితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బోర్‌వెల్‌ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ,నీటి వినియోగంలో పొదుపు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు,ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు,అనంతరం మంత్రి "జలసిరి" ప్రచార పోస్టర్లను,జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు,అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలవనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు,ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు,మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/** ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2026--27 విద్యా సంవత్సరానికి క్రింది సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీలు:

- కెమిస్ట్రీ -- 01
- కామర్స్ -- 01
- కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ -- 01
- ఇంగ్లీష్ -- 01
- పొలిటికల్ సైన్స్ -- 01
- జువాలజీ -- 01

అర్హతలు:సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది. పిఎచ్ డి, నెట్, సెట్, అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది,ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులను జతచేసి 2026 జూలై 24 లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట కార్యాలయంలో సమర్పించాలి,దరఖాస్తు చేసిన అభ్యర్థులు 2026 జూలై 25న తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), సంగారెడ్డిలో నిర్వహించే ఇంటర్వ్యూకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బంగ్లా భారతి సూచించారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల పై ఎమ్మెల్యే ఆగ్రహం...

## ఎల్-నినో ప్రభావంపై సమీక్షా సమావేశంలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/నియోజకవర్గంలో విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు,సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు,ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గానికి మంజూరైన నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు,ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలంటే సబ్‌స్టేషన్ల పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు,దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ, నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు,అలాగే సదాశివపేట పట్టణంలోని 8,9 వార్డుల పరిధిలోని సిద్ధాపూర్ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అమృత్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొంటూ, పనులను వేగవంతం చేసి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని కోరారు,వేసవి పరిస్థితులు, ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.

# ప్రతి నీటి చుక్కను ఒడిసిపడుదాము

## . భవిష్యత్తు ను కాపాడుదాము
## . జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
## . తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై -20( ప్రజాబలం ప్రతినిధి )**వర్షాకాలంలో ప్రతి నీటి చుక్కను ఒడిసిపడుదామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. వీబీజీ రాంజీ, తెలంగాణ పంచాయతీ రాజ్.. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆద్వర్యంలో రూపొందించిన తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్



గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు (పామ్ పాండ్), ఊట కుంట (పర్కొలేషన్ ట్యాంక్), బోరు బావుల రీచార్జ్ పనులు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, లోటు వర్షపాతం నేపథ్యంలో వర్షం నీటిని ఒడిసి పట్టాలని పిలుపు నిచ్చారు. భవిష్యత్తును కాపాడుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారి జయశ్రీ, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లపై జరుగుతున్న బెదిరింపులు, అక్రమాలపై జోక్యం, చేసుకోండి
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి బీజేపీ ప్రతినిధి బృందం పిర్యాదు



హైద్రాబాద్ జులై 20 : ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఓటర్లపై జరుగుతున్న బెదిరింపులు, అక్రమ జోక్యం, ఓటరు నమోదు ప్రక్రియకు ఆటంకాలు మరియు బీఎల్ఓలపై ఒత్తిళ్ల అంశాలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి (జజుూ) బీజేపీ ప్రతినిధి బృందం నివేదిక సమర్పించింది.

అదేవిధంగా 2025 నుంచి బీఎల్ఓలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి వారికి న్యాయం చేయాలని, ఆదుకోవాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని (జజుూ) డిమాండ్ చేశారు

ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు మీడియాతో మాట్లాడుతూ

హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, చేవెళ్ల ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కాకుండా కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారు.

ముఖ్యంగా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఎల్ఓలపై ఒత్తిళ్లు తీసుకొస్తూ, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కాకుండా ప్రయత్నిస్తున్నారని పేర్కొంన్సరు. హైదరాబాద్ నగరంలో బీజేపీకి అనుకూలంగా ఉండే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు కాకుండా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

ఓటర్లు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు, ఓటు నమోదు విషయంలో ఎక్కడైనా ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమాలు ఎదురైతే వెంటనే బీజేపీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఓటర్ల హక్కులను పరిరక్షించేలా తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాన ఎన్నికల అధికారి హామీ ఇచ్చారు.

# సర్ ప్రక్రియలో ప్రతి ఓటర్ భాగస్వాములు కావాలి
## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



హైద్రాబాద్ జులై 20; సర్ ప్రక్రియలో ప్రతి ఓటర్ భాగస్వాములు కావాలనిమాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపు నిచ్చారు

బిజెపి అగ్రనేత , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయని బిజెపి రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్. కోలన్ శంకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ

ఎన్నికల కమిషన్ చేపట్టిన సర్ SIR ప్రక్రియలో ప్రతి ఓటర్ భాగస్వాములు అయ్యే విధంగా ప్రతి సమాజ సేవకులు చురుకుగా పాల్గొని నిజమైన దేశ పౌరులు అందరూ ఓటర్లు గా నమోదు అయ్యే విధంగా చూడాలని బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి తో కోరారు, ఎన్నికల కమిషన్ నిర్ణయం దేశ ప్రజలకు , అన్ని రాజకీయ పార్టీలకు మంచిదే అన్నారు ఇది దేశానికి ఎంతో క్షేమ దాయకం అన్నారు, ఇందులో ప్రతి దేశ భక్తుడుపాల్గొనాలన్నారు.

# బస్సు డ్రైవర్, కండక్టర్‌పై యువకుడి దాడి

కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరు వద్ద విజయవాడ - అవనిగడ్డ కరకట్ట బస్సు డ్రైవర్, కండక్టర్‌పై ఒక యువకుడు ఘాతూకానికి పాల్పడ్డాడు... బస్సు నిండిపోయింది వెనక బస్సు ఖాళీగా వస్తుంది దానిలో ఎక్కండి అని డ్రైవర్ చెప్పాడు. విజయవాడ నుండి కరకట్ట మార్గంలో అవనిగడ్డ వైపు వెళ్తున్న ఈ ఆర్టీసీ బస్సుకు అడ్డంగా సదరు యువకుడు తన ద్విచక్ర వాహనాన్ని నిలిపివేశాడు.

# సొల్లు వాగుడు, బూతు పురాణం ఆయుధంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి

## తెలంగాణ ఆర్థికంగా దివాళా తీస్తోంది
## రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదు
## 90 రోజుల ఆర్థిక పరిపాలనలో 12 వేల కోట్ల పై చిలుకు రెవిన్యూ లోటు వచ్చింది
## ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్

హైద్రాబాద్ జులై 20; రేవంత్ రెడ్డి ది సొల్లు వాగుడు,బూతు పురాణం ఆయుధంగా మార్చుకున్న రేవంత్ రెడ్డితెలంగాణ ఆర్థికంగా దివాళా తీస్తోంది రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదుl90 రోజుల ఆర్థిక పరిపాలనలో 12 వేల కోట్ల పై చిలుకు రెవిన్యూ లోటు వచ్చిందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజ శ్రవణ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం లోఆట్లాడుతూ

రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ నాయకుల జాతి,నీతి అడుగుతున్నారు

రేవంత్ రెడ్డి నీది ఏ జాతి అని ప్రశ్నించారు.

కాగ్ రిపోర్ట్ లో రాష్ట్రం ఆర్థికంగా అతలాకుతలం అయిందని స్పష్టం చేసింది

రేవంత్ రెడ్డి వ్యక్తిగత దోపిడీకి పాల్పడుతున్నారు

తెలంగాణను మరో బీమారు రాష్ట్రంగా రేవంత్ రెడ్డి మార్చారు

వ్యక్తిగతంగా సీఎం రేవంత్ రెడ్డి,మంత్రుల ఆస్తులు ఎట్లా పెరుగుతున్నాయి

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తులు తగ్గుతున్నాయి

కాంగ్రెస్ బడ్జెట్ అంతా బోగస్ అని కాగ్ రిపోర్ట్ చెప్పింది

6,857 కోట్ల సర్ ప్లస్ బడ్జెట్ పెట్టారు

ఆరు నెలల్లో 12,289 కోట్ల బడ్జెట్ లోటు వచ్చింది

ట్యాక్స్ రెవిన్యూ 22 శాతం మాత్రమే వచ్చిందిజీఎస్టీ తగ్గిపోయిందది

ఆర్.ఆర్ ట్యాక్స్ పేరుతో వసూళ్లు చేస్తున్నారు

ఎక్సైజ్ డ్యూటీ రెవిన్యూలోను 18 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది

రాష్ట్ర ఖజానాకు నష్టం చేస్తున్నార

వైన్ షాపులు,బెల్టు షాపులు విపరీతంగా పెరిగాయి

రాష్ట్ర ఖజానాను పందికొక్కుల్లా దోచుకు తింటున్నారు

75 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి 5.7 శాతం గ్రాంట్లు మాత్రమే తెచ్చారు

రేవంత్ రెడ్డి ఇప్పటికే 4.50 లక్షల కోట్ల అప్పులు చేసింది

రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ఇచ్చిన నజరానా ఆర్థికంగా దివాళా తీయడం ఆర్థిక



సంవత్సరం అయ్యే సరికి లక్ష కోట్ల రెవిన్యూ లోటు వస్తుందిఒళ్ళు దగ్గర పెట్టుకుని పరిపాలన చేయాలి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎట్లా అమలు చేస్తారు

రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ ఎట్లా కడతారు

మెట్రోను ప్రభుత్వం తీసుకుని 12 వేల కోట్ల అప్పు ప్రజలపై భారం వేశారు. సీఎం రేవంత్ రెడ్డిని,మంత్రులను గల్లాలు పట్టి నిలదీయాలని పిలుపు నిచ్చారు

# సర్ పక్రియలో ప్రతి ఒక్కరికి జిహెచ్ఎంసి అండగా ఉంటుంది
## జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ జులై 20 ; సర్ పొలిటికల్ పార్టీ BLO మరియు దీూా తో ఈరోజు సమావేశం అయ్యారు అరుంధతి సేవా మండల్ గణేష్ మందిర్ చూడి బజార్లో జరిగింది జిహెచ్ఎంసి ప్రజలకి అందుబాటులో ఉండాలని అన్ని కమ్యూనిటీ హాల్లో మరియు వాడ ఆఫీసులో ప్రతి బూతులు ఈరోజు సమావేశం అయ్యారు జిహెచ్ఎంసి ఉమా ప్రకాష్ డిప్యూటీ కమిషనర్ ఈ సమావేశం కి రావడం జరిగింది ప్రజలకి అన్ని విధంగా జిహెచ్ఎంసి అండగా ఉంటుందని చెప్పడం జరిగింది మరియు అన్ని పొలిటికల్ పార్టీలోకి BLA మరియు AERO, దీూా చాలా ధన్యవాదములు అని చెప్పడం జరిగింది, టిడిపి ఫ్లోర్ లీడర్ ూ×= కమిటీ ఇన్చార్జ్ రామ్ నగర్ యాదవ్, కేడి దినేష్, ఆనంద్ సింగ్, డాక్టర్ ప్రేమ్ ప్రకాష్ శర్మ, ప్రేమ్ కుమార్, దామోదర్ శర్మ, H. గౌతమ్, S. యోగేష్. తదితరులు పాల్గొన్నారు ప్రజలని అన్ని విధంగా ‡ SIR గురించి నియోజవర్గంలో ప్రతి ఒక్కరూ ఈ ఎస్ ఏ ఆర్ లో పాల్గొనాలి కొందరు సొంత ఇల్లు లేక కిరాయి ఇంట్లో ఉంటారు గోషామహల్ నియోజకవర్గం లో చాలా మంది రాజస్థాన్ మరియు కర్ణాటక మరియు మహారాష్ట్ర నుంచి వచ్చిన వాళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారు వాళ్లని కూడా డిఎల్ఏగా పూర్తి సహాయం చేస్తున్నాము, GHMC కూడా వీళ్ళని ఆదుకోవాలి ఈ ఎస్ ఆర్ లు పూర్తి సహాయం మరియు అవగాహన గురించి ుఞూ గోషామహల్ నియోజకవర్గంలో ప్రజల సేవలో ఉంటుందని పేర్కొన్నారు.

# గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.
## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.





**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 20( ప్రజా బలం ప్రతినిధి)**ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని

# కోతుల దాడిలో కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలు

## సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రక్షణ కరవు

## బాధిత కార్మికుడిని పరామర్శించిన కార్మిక సంఘాల నాయకులు శనగల శ్రీనివాస్, మద్దెల శ్రీనివాస్

**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై-20, ప్రజాబలం ప్రతినిధి :** సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస రక్షణ కరువైందని, వారి ప్రాణాలకు యాజమాన్యం విలువ ఇవ్వడం



లేదని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు శనగల శ్రీనివాస్, మద్దెల శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 ఇంక్లైన్ కాలనీ ఆర్ జి టూ సివిల్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న ఓరుగంటి మహేందర్ అనే కాంట్రాక్టు కార్మికుడు ఫిల్టర్ బెడ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా కోతులు అతనిపై దాడి చేశాయన్నారు. ఈ దాడిలో భయాందోళనకు గురైన మహేందర్ సుమారు 10 ఫీట్ల ఎత్తున్న వాటర్ ట్యాంక్ స్టెప్పుల పైనుండి ప్రమాదవశాత్తు క్రింద పడిపోయాడని, ఈ ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగిపోవడంతో, ప్రస్తుతం సింగరేణి ఏరియా హాస్పిటల్ లో సిమెంటు పట్టితో చికిత్స పొందుతున్న తీరులో విషయం తెలుసుకున్న కార్మిక సంఘాల నాయకులు శనగల శ్రీనివాస్, మద్దెల శ్రీనివాస్ లు ఆసుపత్రికి వెళ్లి బాధిత కార్మికుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. సింగరేణి యాజమాన్యం, అధికారులు కాంట్రాక్టు కార్మికులపై తీవ్రమైన పనిభారం మోపుతూ, వెట్టిచాకిరి చేయిస్తున్నారని మండిపడ్డారు. కార్యాలయాలు, పని స్థలాలలో కోతుల దాడులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. కార్మిక బాధిత కార్మికుడు ఓరుగంటి మహేందర్ కు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలనీ డిమాండ్ చేశారు. చికిత్స కాలంలో కార్మికుడు తిరిగి విధులకు హాజరయ్యేంత వరకు అతని కుటుంబానికి ప్రతి నెల పూర్తి వేతనం చెల్లించాలి. వైద్య ఖర్చుల నిమిత్తం సంబంధిత కాంట్రాక్టర్ బాధిత కార్మికుడికి తగిన నష్టపరిహారం తక్షణమే చెల్లించాలి. కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వీడకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు డ్రైడే కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

## వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష

**పెద్దపల్లి, జూలై-20, ప్రజాబలం ప్రతినిధి :** సీజనల్ వ్యాధుల నియంత్రణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధమని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్రైడే కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గుముఖం పడతాయని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్రైడే కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా నీటి నిల్వలు ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ప్రతి ఆశా కార్యకర్త కనీసం 30 ఇళ్లను సందర్శించి దోమల నివారణ, పరిశుభ్రత, నీటి నిల్వల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తల పనితీరును సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో క్రాస్ వెరిఫికేషన్ చేసి



కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతోందో లేదో నిర్ధారించాలని ఆదేశించారు. పెద్దపల్లి, రామగుండం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య అధికంగా ఉన్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలు) ఓపీ సేవలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. పీహెచ్‌సీలలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా జిల్లా ఆసుపత్రులపై ఉండే రోగుల ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల శాతాన్ని 85 శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేయాలని, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
హెచ్‌పీవీ టీకాల స్వీకరణను పెంచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్‌సీడీ కార్యక్రమం కింద అవసరమైన మందులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.పవిత్ర, సంబంధిత డాక్టర్ లు ,తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లిప్రజావాణి లో సమస్య ల పై నమ్మకం కోల్పోయిన ప్రజలు

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 20(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంప్రజావాణి కార్యక్రమంలో వ్యవసాయ అధికారి (Agriculture Officer), ఏపీఓ (APO), ఏపీఎం (APM), Department) విద్యుత్ శాఖ (Electricity Department) మార్కెట్ కమిటీ అసిస్టెంట్ మరియు ఎంపీడీఓ హాజరయ్యారు మొదట్లో ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లాలి సమస్యను అధికారులకు తెలియపరచాలి అని చాలా సమస్యలతో ప్రజలు ప్రజావాణి సమావేశానికి హాజరు అయ్యేవారు వారి ఆశలన్నీ నిరాశగా అనిపించి ప్రస్తుతం ప్రజావాణికి రావడానికి ప్రజలు అంగీకరించలేనట్టు కొందరు ప్రజలు




తెలిపారు,మొత్తం ఒక (01) దరఖాస్తు మాత్రమే స్వీకరించబడింది. మర్పల్లి గ్రామానికి చెందిన ఒక రైతు యూరియా ఎరువు కొరత (ఖతీము ాప్త్రశీత్మీఖ్స్త్రవ) విషయమై దరఖాస్తు సమర్పించారు. సంబంధిత దరఖాస్తును తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖకు పంపించడము జరిగింది. అని అధికారులు తెలిపారు

# మర్పల్లి మండల సమైక్య సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 20(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంమండల మహిళా సమాఖ్య సమావేశంలో ఎం.పి.డి.ఓ. ప్రసంగ సారాంశం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల మహిళా సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేను పాల్గొని మహిళలను ఉద్దేశించి పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించాను. ముఖ్యంగా ఇంటింటికి ఇంకుడు గుంతలు మరియు గ్రామ గ్రామానికి ఇంకుడు



కుంటలు కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపారు,
గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని, పారిశుధ్య కార్యక్రమాల్లో మహిళలు ముందుండి ప్రజలకు అవగాహన కల్పించి సహకరించాలని కోరడం జరిగింది.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి కుటుంబం తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటిని తప్పనిసరిగా మరిగించి, వడకట్టి వినియోగించాలని సూచించాను. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని కూడా తెలియజేశాను.



ప్రభుత్వం చేపడుతున్న “ఇంటికి ఒక ఇంకుడు గుంత -- ఊరుకు ఒక ఊట కుంట -- పంటకు ఒక పంటకుంట” కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో విజయవంతం చేయాలని, ప్రతి బోరు వద్ద రీచార్జ్ పిట్ నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పరిరక్షించాలని వివరించాను. ఈ కార్యక్రమాలను ప్రతి ఇంటికి మహిళల ద్వారా చేరవేసి ప్రజలను భాగస్వాములను చేయాలని కోరడం జరిగింది.
అదేవిధంగా, ఎస్ఐఆర్ (ూ×=) కార్యక్రమంపై కూడా అవగాహన కల్పించి, ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ దరఖాస్తులను సేకరించి, పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసి, మండల పురోగతి శాతాన్ని పెంచేందుకు మహిళా సమాఖ్య సభ్యులు తమ వంతు సహకారం అందించాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో మండల సమైక్య అధ్యక్షురాలు ఏ పి ఎం చిన్న సంఘాల లీడర్లు సీసీలు మహిళా సోదరులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## 175 దరఖాస్తుల రాక

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై - 20( ప్రజాబలం ప్రతినిధి)**ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణి మొత్తం 175 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని





ఆదేశించారు.
డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కి 6, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో 4 ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది...

## డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/బిఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల రాధా కృష్ణ సోమవారం డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు,రాధ కృష్ణ కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు,ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు,కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ గౌడ్



,జార్జ్ , కూన సంతోష్, కిరణ్ గౌడ్,మహేష్ ముదిరాజ్,తోపాజి హరీష్, నగేష్ ,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## వన్ నేషన్--వన్ ఎలక్షన్ ప్రచారానికి బీజేపీ రాష్ట్ర కమిటీ వేగం

### జోన్--1 రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా సోమారావు లావణ్య



**పెద్దపల్లి, జూలై -20, ప్రజాబలం ప్రతినిధి :**వన్ నేషన్--వన్ ఎలక్షన్ పై తెలంగాణలో విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీల ఏర్పాటు, సోషల్ మీడియా బృందాలు, విద్యార్థి అవుట్‌రీచ్ కార్యక్రమాలు, వక్తల శిక్షణ వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర ఇన్‌చార్జ్‌లకు అప్పగించారు.

హైదరాబాద్‌లో జరిగిన వన్ నేషన్--వన్ ఎలక్షన్ రాష్ట్ర సమన్వయ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ జీ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు సహాధ్యక్షులుగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ప్రారంభ ప్రసంగం చేశారు. సమావేశంలో ప్రతి జిల్లాలో ఒక జిల్లా కన్వీనర్, ముగ్గురు సహ-కన్వీనర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో ఒక మహిళా ప్రతినిధి, ఒక యువజన ప్రతినిధి, ఒక సోషల్ మీడియా ప్రతినిధి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించి పర్యవేక్షణ బాధ్యతలను కేటాయించారు. జోన్--1 రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా సోమారావు లావణ్యను నియమించగా, మానిటరింగ్ ఇన్‌చార్జ్‌గా మురళీధర్ బాలాను నియమించారు. జిల్లా స్థాయి కార్యక్రమాల అమలును సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించే బాధ్యత ఈ జోనల్ బృందాలదే. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సోషల్ మీడియా బృందాన్ని ఏర్పాటు చేసి డిజిటల్ ప్రచారం, కంటెంట్ రూపకల్పన, సోషల్ మీడియా అవుట్‌రీచ్ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 200 మంది వక్తల ప్యానెల్‌ను సిద్ధం చేయాలని, అందులో కనీసం 30 శాతం మహిళలకు అవకాశం కల్పించాలని తీర్మానించారు. విద్యార్థుల కోసం ప్రత్యేక అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, హాస్టళ్లు, జిమ్‌లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లా వారీగా సభలు, ర్యాలీలు, సోషల్ మీడియా ప్రచారాలు, విద్యార్థి సదస్సులు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది.

## నేషనల్ లెవెల్ నాసా ప్రాజెక్టులో మెరిసిన వేములవాడ శ్రీ చైతన్య విద్యార్థులు




వేములవాడ, జూలై 20: వేములవాడ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నేషనల్ లెవెల్ నాసా ప్రాజెక్టు ఎంపికలో విశేష ప్రతిభ కనబరిచారు. అంతరిక్షంలో గ్రావిటీ ప్రభావం, ఆహార వ్యవస్థ, జీవన విధానం వంటి అంశాలపై రూపొందించిన వారి ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ ప్రాజెక్టును సాయి శ్రీనివాస్ రాజు, ఆర్. సుప్రీత్, ఎల్. శివకుమార్, ఎన్. ప్రమోద్, చి. శివకార్తీక్, ఎం.ఏ. సిన్నాను, వి. యువాన్, ఎస్. జశ్వంత్ కలిసి రూపొందించారు. గత ఏడాది కూడా శ్రీ చైతన్య విద్యార్థులు నోవా హోటల్ ప్రాజెక్టుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.




ఈ సందర్భంగా ఏజీఎం ముద్రకోల రాజు మాట్లాడుతూ, నాసా వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో విద్యార్థులకు అవకాశాలు కల్పించి, ప్రాజెక్టుల విజయానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్లు సునీల్ కుమార్, మమత, ప్రిన్సిపాల్ సుదేశి, డీన్ అంజయ్య, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ అరుణ్ కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జ్ ప్రవళిక, శివాని, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ హరీష్, అరుణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పీటీ సుధాకర్, మారుతి, కవితతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దేవాలయాలే టార్గెట్.. అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

### ముగ్గురు నిందితుల అరెస్టు బంగారం, వెండి ఆభరణాలు, చోరీ సామగ్రి స్వాధీనం

### పీడీ యాక్ట్ నమోదు చేస్తాం: ఏసీపీ వసుంధర యాదవ్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 20:** దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఖమ్మం జిల్లా వి.ఎం. బంజర్ పోలీసులు అరెస్టు చేశారు. పెనుబల్లి మండలం సీతారామపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు చోరీలకు ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.



కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. అరెస్టయిన నిందితులు షేక్ జానీ షరీఫ్, పేరాల నరసింహారావు అలియాస్ బాబీ, అర్వా ఉదయ్ కుమార్‌లుగా గుర్తించారు.

నిందితుల వద్ద నుంచి 24 గ్రాముల బంగారం, 1.536 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే చోరీలకు ఉపయోగించిన కారు, ఇనుప రాడ్, సుత్తి, కటింగ్ ప్లేయర్, స్క్రూడ్రైవర్‌ను పోలీసులు సీజ్ చేశారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు దేవాలయాల్లో జరిగిన చోరీలకు ఈ ముఠాకు సంబంధం ఉన్నట్లు విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. ముఖ్యంగా పెనుబల్లి, తల్లాడ, కల్లూరు, వేంసూరు మండలాల పరిధిలో నమోదైన పలు దేవాలయ చోరీ కేసులను వీరే చేసినట్లు గుర్తించామని చెప్పారు. నిందితులపై గతంలో కూడా వివిధ పోలీస్ స్టేషన్లలో అనేక చోరీ కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు.

ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న ఈ నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసే చర్యలు చేపడుతున్నట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. దేవాలయాల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలి.

### విద్యార్థుల కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచాలి:సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.




**రాజన్న సిరిసిల్ల జిల్లా ,జూలై 20 ,(ప్రజాబలం ప్రతినిధి)** విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కళలు కనాలని , ఆకళల సాధనకై నిత్యం శ్రమించాలని విద్యార్థులకి డిఎస్పీ నాగేంద్రచారి సూచించారు. ఈసందర్భంగా సోమవారం రోజున తంగాళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ కళాశాలలో తెలంగాణ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ... యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకై నిత్యం శ్రమించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధ్యాపకులకు సూచించారు.

ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ వినాశనానికి దారి తీసే మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలనీ పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఈగల్ టీమ్ డిఎస్పీ ఉపేందర్, ఎస్.ఐ ఉపేందర్ చారి, కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సింధు హాస్పిటల్స్ సందర్శించిన పద్మశ్రీ మురళీ మోహన్

### అత్యాధునిక వైద్య సేవలు, సామాజిక సేవా దృక్పథంపై ప్రశంసలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

హైదరాబాద్: ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం అందుకున్న ప్రముఖ సినీ నటుడు, నిర్మాత శ్రీ మురళీ మోహన్ హైదరాబాద్లోని హైటెక్ సిటీలో ఉన్న సింధు హాస్పిటల్స్ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అత్యాధునిక వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, పరిశీలించిన ఆయన సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రఖ్యాత వైద్యుల నైపుణ్యం అత్యాధునిక సాంకేతికత, కరుణ, సామాజిక బాధ్యతలను సమన్వయం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్న సంస్థగా సింధు హాస్పిటల్స్ నిలుస్తోందని అభినందించారు.





ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నక్యాన్సర్ చికిత్సతో పాటు 30కు పైగా మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు గురించి తెలుసుకొని సాధారణ ప్రజలకు మంచి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే సింధు హాస్పిటల్స్ సంకల్పం అభినందనీయమని పేర్కొన్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, వారి సహాయకుల కోసం ఏర్పాటు చేసిన నివాస భవనం బండి'స్ ఆశ్రయ గురించి తెలుసుకొని ఈ సేవా కార్యక్రమాన్ని కొనియాడారు. వైద్య సేవలతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇస్తున్న సంస్థగా సింధు హాస్పిటల్స్ను అభివర్ణించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను, వారి కుటుంబ సభ్యులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్సపై సంతృప్తి గురించి ఆరా తీశారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఇంచార్జి డీపీఆర్ఓ గా శ్రీనివాసాచారి



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 20 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి డీపీఆర్ఓ గా శ్రీనివాసాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీనివాసాచారి ఇంచార్జి డీపీఆర్ఓగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. జర్నలిస్టులకు అందుబాటులో ఉండి.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను చేరవేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులు, అధికారులను సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్తానని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేస్తామని, త్వరితగతిన కార్డులు జారీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఇంచార్జి డీపీఆర్ఓ స్పష్టం చేశారు.

# సర్ ఇక్కట్లు తొలగించి ప్రజలకు సహకరించండీ



**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 20 జులై 2026**రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా చేపట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా ఆదివారం రోజున భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపుర్ నాయకులు మాజీ కౌన్సిల్లర్ ఆలస్యం నవీన్ కుమార్, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ తదితరులు మణికొండ, నెక్నంపుర్, పుప్పాలగూడ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన సమాచారం మేరకు ఇప్పటి వరకూ 60 శాతం ఫారమ్ లు అందజేయడశీ, కేవలం 25 శాతం ఫారమ్ లు తిరిగి పొందడశీ జరిగినదని తెలియ వచ్చినది. ఇందుకు ముక్య కారణంగా బి.ఎల్.ఒ ల వివరాలు తెలయక, ఫారమ్ పొంది పూరించలేక, 2002 వివరాలు అందుబాటులో లేక పర్యవసానంగా చాలా మంది నిర్లక్ష్య వైఖరితో ఓటర్ జాబితా సవరణకు సుముఖత చూపడం లేదు. కాని ప్రజలు తెలుసు కోవలసిన ముఖ్య విషయం ఏమనగా ప్రాథమిక ఓటు హక్కు కలిగినప్పుడె రాబోయే కాలంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభావం చూపే సరి అయిన ప్రజా ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది కావున ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితా సవరణకు (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సంపూర్ణ మద్దతు పలుకుతె, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రజలందరికి బి.ఎల్.ఒ ల వద్ద ఉన్న ఫారమ్ తీసుకు రావడానికి, ఇబ్బందులకు గురి కాకుండా పూరించడానికి, ప్రతి ఓటర్ 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో ప్రస్తుత ఓటును జత కలుపడం (మ్యాపింగ్ చేసుకొవడం) లో తమ వంతు కృషి, సహకారం, సంపూర్ణ మద్దతును గత కొన్ని రోజులుగా అందిస్తున్నమనీ బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఇక్కట్లను పరిగణనలోకి తీసుకుని పరిష్కార మార్గంగా సంబంధిత ప్రభుత్వ అధికారులు నెక్నంపుర్ డివిజన్ పోలింగ్ కేంద్రాలైన నెంబర్ 29 మొదలుకొని 57 వరకు బి.ఎల్.ఒ లను ఒకచోట, మణికొండ సంబంధిత డివిజన్ పోలింగ్ కేంద్రాల నెంబర్ 58 మొదలుకొని 85 వరకు బి.ఎల్.ఒ లను మరొక చోట వ్యవస్థ ఏర్పాటు చేస్తే సంబంధిత ఓటరులు తమకు తామే వచ్చి అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తారని అందే లక్ష్మణ్ రావు తన అభిప్రాయంను ఒక సూచనగా వెల్లడించారు.

# ఆర్యనగర్‌లో తాగునీటి బోరు ప్రారంభం



**జహీరాబాద్, జూలై 20 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు ఆర్యనగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన నూతన బోరును సోమవారం మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సుధీర్ బండారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్యనగర్‌లో చాలా కాలంగా ఉన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని బీజేపీ కౌన్సిలర్ బొగ్గుల సంతోష్ ఆధ్వర్యంలో బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బోరు ద్వారా స్థానికులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చి సమస్యకు ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గడ్డం నాందేవ్, ఒగ్గు విటల్, అప్సర్ దిల్దార్, ప్రకాష్, సందీప్, రవి, సారా జగదీష్, మనోజ్ యాదవ్, గడ్డం శ్రీధర్, గోపాల్, వేణు, చిత్రశేఖర్, పాలింకర్ మహేష్, దత్తు, విజయ్, శ్రీకాంత్, భరత్, ప్రభు, మైనార్టీ సోదరులు, స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు బోరు ఏర్పాటు చేసిన కౌన్సిలర్ బొగ్గుల సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# జహీరాబాద్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు




**జహీరాబాద్, జూలై 20 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జహీరాబాద్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ (తాత్కాలిక లెక్చరర్లు) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహమ్మద్ అస్లం ఫారూఖీ తెలిపారు. ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, కామర్స్, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీ ఫార్మాస్యూటికల్ తదితర సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు జనరల్ అభ్యర్థులకు 55 శాతం, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు, బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధృవపత్రాలతో జూలై 22 మధ్యాహ్నం 3 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, జూలై 25 ఉదయం 10 గంటలకు సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# వెంకటేశ్వర కాలనీలో టీటీడీపీ ప్రజా పథం కార్యక్రమం

సికింద్రాబాద్ పార్లమెంట్ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర కాలనీ డివిజన్ లో ప్రజా పదం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని, గత తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనబడుతుందని తెలుగుదేశం పార్టీ అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు.

# నీట్‌లో మైనార్టీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**జహీరాబాద్, జూలై 20 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ సమీపంలోని అల్గోల్ బాయ్స్--1 తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు నీట్--2026లో ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన సుమారు 10 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ కలీమ్ సిద్ధిఖీ జమీల్ తెలిపారు. చవాన్ రవీందర్ 497, షేక్ అద్నాన్ అలీ 469, మహమ్మద్ సైఫ్ ఖురేషీ 461 మార్కులతో అత్యధిక మార్కులు సాధించారు. కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తామని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వంతో ఈ ఫలితాలు సాధ్యమైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# కుక్క అడ్డురావడంతో అదుపుతప్పిన ద్విచక్ర వాహనం. సకాలంలో స్పందించిన 108 సిబ్బంది తప్పిన ప్రాణాపాయం.




**సత్తుపల్లి,ప్రజాబలం ప్రతినిధి జూలై 20:** సత్తుపల్లి మండలం రేగళ్లపాడు బుగ్గపాడు ప్రధాన రహదారిపై కుక్క అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడికి సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలంలోనే అత్యవసర చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు.

కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల చక్రవర్తి (25) రేగళ్లపాడులోని పామాయిల్ తోటకు కూలి పనికి వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో అతని ఎడమ తొడ ఎముక విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం అయింది. ఎడమ చేతి చూపుడు వేలు తెగి వేలాడే పరిస్థితి ఏర్పడింది.



సమాచారం అందుకున్న వెంటనే సత్తుపల్లి 108 అంబులెన్స్ ఈఎంటీ గొల్లమందల కృష్ణ, పైలట్ పెద్దగౌడ ఏకాంత్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన యువకుడికి స్ప్లింటింగ్ చేసి, సెలైన్, ఆక్సిజన్ అందిస్తూ, మెడకు సర్వైకల్ కాలర్ అమర్చి ఆధునిక అత్యవసర వైద్య సేవలు అందించారు. అనంతరం అంబులెన్స్‌లోనే చికిత్స కొనసాగిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు.

సకాలంలో స్పందించి యువకుడికి ప్రాణాపాయం తప్పించిన 108 సిబ్బందిని మూడు జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, ఖమ్మం జిల్లా 108 నూతన జిల్లా అధికారి ఆలేటి ప్రణయ్ కుమార్, రేగళ్లపాడు, బుగ్గపాడు, కాకర్లపల్లి గ్రామస్థులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

# పెనుబల్లిలో డాక్టర్ మట్టా దయానంద్ పర్యటన.. అనారోగ్య బాధితుడికి పరామర్శ, కుటుంబానికి సానుభూతి



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 20:**పెనుబల్లి మండలం కొండ్రుపాడు గ్రామంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సోమవారం పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న యలమంచిలి రామచంద్రయ్యను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

అనంతరం ఇటీవల మృతిచెందిన మోరంపూడి రాజమ్మ దశదినకర్మకు హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



తదుపరి కొండ్రుపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను పరిశీలించి, గ్రామాభివృద్ధికి చేపడుతున్న పనులపై స్థానికులతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, కల్లూరు ఏఎంసీ వైస్ చైర్మన్ రాజబోయన కోటేశ్వరరావు, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల రేషన్ బియ్యం.. ఒకేసారి డీఎస్ఓ నిత్యానంద్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 20 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :**ఎలినినో ప్రభావంతో వర్షాలు లేక కరవు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో 3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సన్నబియ్యం ఒకేసారి ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్వో నిత్యానంద్, తెలిపారు. జిల్లాలో రేషన్ దుకాణాలు 520,తెల్లకార్డులు 2.41,832 ఉన్నాయి. మూడు విడతలుగా ఇస్తారని ఆయన తెలియజేశారు......

## వర్షాల కోసం ముస్లిం సోదరులు ప్రార్థనలు, కరుణించిన వానదేవుడు.



**ఖమ్మం/తల్లాడ ప్రతినిధి జూలై20 ప్రజాబలం:**వర్షాలు సకాలంలో కురిసి రైతుల పంటలు పండాలని తల్లాడలో ముస్లిం సోదరులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ను చదివి వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు సాగు చేయలేని పరిస్థితిలో ఉన్నారని, వర్షాలు పడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలతో సోమవారం వానదేవుడు కరుణించిన విధంగా రైతులు ఆశించిన విధంగా వర్షం పడి రైతులలో ఆనందం రేకెత్తించింది, వర్షాలు ఈ విధంగా పడి ఈ సంవత్సరం పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్. ఈసూబ్, అక్బర్, మౌలి సాబ్ ముజీబ్,నిజాముద్దీన్,గాలి, జాన్ పాషా, మస్తాన్, మున్నా, సలీం, ముస్తఫా, అబ్దుల్ రెహమాన్, వద్దండి సాహెబ్, మే బల్లి,బాజీ,ఖాసీం, ఇలియాజ్,తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర.



**ఖమ్మం/తల్లాడ ప్రతినిధి జులై 20 ప్రజాబలం:**తల్లాడ మండలంలో విస్తృతంగా పర్యటించిన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.తల్లాడ పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ, దగ్గుల రఘుపతి రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆదివారం తల్లాడ పట్టణంలోని రఘుపతి రెడ్డి గారి నివాసానికి



వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం గొల్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధూండేటి కేశవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఈరోజు ఆయన నివాసానికి వెళ్లి ఆయన పరామర్శించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, తల్లాడ పట్టణ అధ్యక్షుడు జివిఆర్ ,
మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట లాల్, సత్తుపల్లి మాజీ బీసీ సెల్ అధ్యక్షులు కోడూరు వీర కృష్ణ,
మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,తల్లాడగ్రామపంచాయతీమాజీ వీడిసి, బీఆర్ఎస్ పార్టీ జోనల్ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కోడూరి నాగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, మైపాల్ రెడ్డి,
కోడూరి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు విసనపల్లి వీరయ్య, కోడూరు సత్యనారాయణ, బొగ్గుల కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు .

## ప్రజావాణి పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 20**సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.
ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 82 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 22, ఇందిరమ్మ ఇండ్లు 18, పెన్షన్ 17, ఇతర శాఖలకు సంబంధించినవి 25 ఫిర్యాదులు అందాయి.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డిప్యూటీ ట్రైని కలెక్టర్ కుషీల్,జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలుచేయాలి,




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 20 ములుగు** హరే రామ హరే కృష్ణ అనే స్వచ్ఛంద సంస్థకు అల్పాహారం పథకం అప్పజెప్పడం అంటే కార్మికులను రోడ్డున పడేయడమే,
కోడిగుడ్లు గ్యాస్ నిత్యావసర సరుకులు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలి,
-: ఏఐటీయూసీ :-
ఈరోజు కోడిగుడ్ల ధరలు మార్కెట్లో విపరీతంగా పెరిగిపోతున్న సందర్భంలో ప్రభుత్వం ఇస్తున్న రూపాలు 6 ఏ మాత్రం సరిపోవడం లేని మూలాన కోడిగుడ్లు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ధర్నా చేయడం జరిగినది
ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ బి ఆర్ఎస్ ప్రభుత్వం లో చేసిన అనేక పోరాటాలలో నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులందరూ మా పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొని అనేక హామీలు ఇవ్వడం జరిగినది ఆ సందర్భంలో జరిగిన ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే రూపాయలు పదివేల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఎజెండాలో పెట్టుకోవడం జరిగినది అన్నారు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు దాటుతున్న పదివేల రూపాయల విషయంలో ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు అన్నారు, రూ,, పదివేలు ఎక్కడ అడుగుతారో అనుకొని, అల్పాహారం పేరుతోని అక్షయ పాత్ర అనే స్వచ్ఛంద సంస్థకు కట్టపెట్టడానికి ప్రభుత్వం సిద్ధపడడం అంటే వంట కార్మికులను రోడ్డున పడేయడానికి సిద్ధం అయినట్లే నని అన్నారు ఇప్పటికే అనేక పాఠశాలలో అక్షయ పాత్ర ధ్వారా అందిస్తున్న అల్పాహారం ఏమాత్రం బాగుండడం లేదని, విధ్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,గగ్గోలు పెడుతున్నా ముఖ్యమంత్రి కానీ మంత్రులు కానీ స్పందించకపోవడం చాలా అన్యాయం అన్నారు, అందుకే గౌరవ ముఖ్యమంత్రి మంత్రులు ఒకసారి ఆలోచన చేసి ఇది వ్యాపారం కాదు సేవాభావం విధ్యార్థులకు ఖర్చుపెడితే భారంగా భావించకుండా సెంట్రలైజ్డ్ కిచ్చెన్ విధానం పేరుతోని అక్షయపాత్రకు ఇచ్చేవిధానం విరమించుకొని అల్పాహారం కూడా వంట కార్మికుల తోనే నిర్వహించాలని తధ్వారా కార్మికులకు ఉపాధి, విధ్యార్థులకు నాన్యమైన అల్పాహారం దొరుకుతుంది అన్నారు, అలాగే వంట కార్మికులను అకారణంగా రాజకీయ ఇతరత్రా కారణాలతో తొలగించకుండా జీఓ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు
ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బండి నర్సయ్య, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, మాతంగి శ్యాంశు ందర్,తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం భారతి, ఉపాధ్యక్షులు పోరెడ్డి ప్రమీల, గున్నాల రాజకుమారి, సామ సమ్మక్క, కుడుముల సమ్మక్క, అంకం పద్మ, జనగాం శోభ, అల్లి అమ్రుత, భవాని, కమలక్క, శ్రీనివాస్, స్వరూప, భాగ్య, రమ,లక్ష్మి,మద్దిభోయిన భారతి, నాగమణి, సమ్మక్క, సుగుణ, సరోజన, మౌనిక, మరియు కార్మికులు పాల్గొన్నారు,,

## ములుగు జిల్లా రైతు సోదరులకు ముఖ్య గమనిక జిల్లా అత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 20** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, రాయితీలు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత ప్రయోజనాలను పొందాలంటే “ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు గుర్తింపు కార్డ్)” నమోదు చేసుకోవడం అత్యంత ఆవశ్యకం.
మీరునమోదుచేసుకోకపోతే కలిగే నష్టాలు:
ప్రభుత్వపరంగా రైతులకు అందే ఎటువంటి ఆర్థిక మరియు ఇతర సహాయ కార్యక్రమాలకు మీరు అనర్హులయ్యే ప్రమాదం ఉంది.
పంట సాగు వివరాలు నమోదు కాకపోవడం వల్ల భవిష్యత్తులో రైతులకు అందే రాయితీలు, సబ్సిడీలు నిలిచిపోయే అవకాశం ఉంది.
ప్రభుత్వ రికార్డుల్లో మీ వివరాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.
కాబట్టి, ఏ రైతు సోదరుడూ ఈ ప్రయోజనాలను కోల్పోకూడదని మా విజ్ఞప్తి. మీరు మీ లిఆధార్ కార్డ్ జిరాక్స్, పట్టా పాస్ బుక్ జిరాక్స్, మరియు ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ ఉన్న ఫోన్ వెంట తీసుకుని, ఉదయం 10 గంటలకు అన్ని మండలలో ఉన్న రైతు వేదికలి వద్దకు వచ్చి వెంటనే మీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోగలరు.
రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము

## బిఎల్వోలు సకాలంలో సర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి. సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ రాయల రాము.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై20 ప్రజాబలం:**సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలంలో ఓటర్ సవరణ నమోదు కార్యక్రమంపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ రాయల రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఓటర్ నమోదు ప్రక్రియ గడువు పెంచిందని, ఈ గడువులోపు బిఎల్వోలు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 90 శాతం పూర్తి అయిందని, మిగతావి కూడా బిఎల్ఓ లు పూర్తి చేయాలని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఓ లు నమోదు ప్రక్రియ గురించి క్షుణ్ణంగా ఓటర్లకు అవగాహన కల్పించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెనుబల్లి మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, మాధవరెడ్డి పోలేపల్లి శ్రీను, లకావత్ నాయక్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదం లోయువకుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



**జహీరాబాద్, జూలై 20 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని గడికి చెందిన దయానంద్ అలియాస్ డ్యానీ (34), తన స్నేహితుడు రాహుల్‌తో కలిసి స్కూటీపై వెళ్తుండగా విక్టర్ షాపింగ్ మాల్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన మహీంద్రా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దయానంద్, రాహుల్ ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దయానంద్ మృతి చెందగా, రాహుల్‌కు చికిత్స కొనసాగుతోంది.మృతుడి తల్లి ఇంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు జహీరాబాద్ టౌన్ ఎస్ఐ లవ కుమార్ తెలిపారు.

# పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట: డీజీపీ సి.వి. ఆనంద్

- పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత పథకాలపై సమగ్ర సమీక్ష
- విద్య, వైద్యం, వివాహ సహాయం, బీమా పథకాల బలోపేతానికి ఆదేశాలు
- పోలీసు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షలకు ప్రత్యేక ప్రోత్సాహం
- సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం
- ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలి: డీజీపీ




పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తెలంగాణ పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ మరియు ఆరోగ్య భద్రత (గాతీశీస్త్రఝ దీష్ఘుఎతీష్ఘు) విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించేందుకు శాఖ అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పోలీసు పిల్లల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే జేఈఈ, నీట్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సిబ్బందికి వివాహ రుణాలు, వైద్య రుణాలు, విద్యా రుణాలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు, అదనపు కార్పస్ ఇన్సూరెన్స్, వివిధ గ్రాంట్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా సమగ్ర ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు డీజీపీ వివరించారు.

ఆరోగ్య భద్రత పథకం ద్వారా వేలాది మందికి వైద్య సేవలు

పోలీసు ఆరోగ్య భద్రత పథకం కింద 2025 సంవత్సరంలో 33,126 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు చికిత్స పొందగా, 2026 జూన్ నాటికి 12,392 మంది ఈ పథకం ద్వారా వైద్య సేవలు పొందినట్లు వెల్లడించారు. ఇందుకోసం 2025లో రూ.181.74 కోట్లు, 2026 జూన్ నాటికి రూ.73.61 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

గ్రూప్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌తో కుటుంబాలకు భరోసా

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా ఆర్థిక రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు రూ.5 లక్షలు, ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.10 లక్షలు, డీఎస్పీలకు రూ.15 లక్షలు, ఐపీఎస్ మరియు అంతకంటే పైస్థాయి అధికారులకు రూ.25 లక్షల బీమా రక్షణ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల దుర్వినియోగం సహించం

సంక్షేమ పథకాలను వ్యాపార దందాగా మార్చే ప్రయత్నాలను ఏమాత్రం సహించబోమని డీజీపీ హెచ్చరించారు. సంక్షేమ పథకాలు వాటి అసలు లక్ష్యానికి అనుగుణంగా అమలయ్యేలా ప్రతి ఒక్కరూ నైతిక విలువలను పాటించాలని సూచించారు. కొద్దిమంది స్వార్థ ప్రయోజనాలకోసం వ్యవహరిస్తే వేలాది మంది పోలీసు కుటుంబాలు నష్టపోయే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సంక్షేమ నిధుల బలోపేతానికి చర్యలు

పోలీసు క్యాంటీన్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు తదితర వనరుల ద్వారా వచ్చే ఆదాయాన్ని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్, పోలీసు పిల్లల విద్య, సివిల్స్, గ్రూప్స్ కోచింగ్, స్కాలర్‌షిప్‌లు, వివాహ సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలని ఆదేశించారు. ఈ పథకాల అమలుకు అవసరమైన బడ్జెట్‌ను మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు.

పారదర్శకత, జవాబుదారీతనానికి టెక్నాలజీ వినియోగం

సంక్షేమ, ఆరోగ్య భద్రత విభాగాల్లో టెక్నాలజీ వినియోగాన్ని విస్తృతంగా పెంచాలని డీజీపీ సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, నిధుల సమీకరణ, వినియోగం, సేవల అమలు వంటి అన్ని అంశాలను సమగ్ర ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేసే విధంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించాలని ఆదేశించారు. వెల్ఫేర్ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని, హోదాల వారీగా వెల్ఫేర్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. శాఖకు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌ల అద్దె రేట్లను పారదర్శకంగా నిర్ణయించి, సిబ్బందికి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా లీజుకు ఇవ్వాలని, శాఖ వనరులను సమర్థవంతంగా వినియోగించి సంక్షేమ కార్యక్రమాలకు అదనపు ఆదాయ వనరులు సమకూర్చాలని ఆదేశించారు.

తక్కువ వడ్డీ రుణాలు అందుబాటులోకి

అర్హులైన పోలీసు సిబ్బందికి ఓపెన్ ప్లాట్ రుణాలు 9 శాతం వడ్డీతో, గృహ రుణాలు 6.75 శాతం వడ్డీతో, వ్యక్తిగత రుణాలు రూ.5 లక్షల వరకు 11 శాతం వడ్డీతో, కుమార్తె వివాహానికి రూ.6 లక్షల వరకు, దేశీయ, విదేశీ ఉన్నత విద్య కోసం రూ.30 లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. సమీక్ష ముగింపులో డీజీపీ మాట్లాడుతూ, "ప్రతి సంక్షేమ పథకం అసలు ఉద్దేశం అర్హులైన ప్రతి పోలీసు ఉద్యోగికి న్యాయంగా ప్రయోజనం చేకూర్చడమే. ప్రతి రూపాయి జవాబుదారీతనంతో ఖర్చు కావాలి. పారదర్శకత, నైతికత, సమర్థవంతమైన నిర్వహణతోనే సంక్షేమ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది" అని అన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులు డీజీపీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు అందజేశారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. ప్రతి పోలీసు కుటుంబానికి భద్రత, సంక్షేమం కల్పించడం తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు శాఖ ముఖ్య లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

ఈ సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్, డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం. భగవత్, ఏడీజీ సంజయ్ జైన్, ఐజీ (మల్టీజోన్-2) షహనవాజ్ ఖాసిం, ఐజీ (ప్రొవిజన్ అండ్ లాజిస్టిక్స్) గజరావు భూపాల్, పోలీస్ వెల్ఫేర్, ఆరోగ్య భద్రత కార్యదర్శి ఉదయ్ కుమార్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు గోపీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో రహదారుల అభివృద్ధి కొరకు ఆందోల్‌కు భారీ నిధులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 20 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** మంత్రి దామోదర రాజనర్సింహ, నిరంతర కృషి, ప్రత్యేక చొరవతో ఆందోల్ నియోజకవర్గంలో రూ.338.63 కోట్లరహదారి అభివృద్ధిపనులు ఆలాదుర్గ్--మేటల్‌కుంట రోడ్డు రూ.217.96,కోట్లు.జోగిపేట- వట్టిపల్లి రోడ్డు రూ.26.64 కోట్లు.తాడ్దాన్‌పల్లిచౌరస్తా--సింగూరు రోడ్డు -- రూ.29.88 కోట్లు. కంకోల్--రాయికోడ్ చౌరస్తా రోడ్డు రూ.33.00,కోట్లు. బుడేరా--మర్పల్లి రోడ్డు --రూ.2.78,కోట్లు.సేగోడ్--రాయిపల్లి,రోడ్డకురూ.9.96,కోట్లు.జోగిపేట--చింతకుంట రోడ్డు --రూ.4.86,కోట్లు.బొడ్మట్పల్లి--నార్సింగిరోడ్డురూ.13.55,కోట్లు.ఆందోల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి దామోదర రాజనర్సింహ నిరంతరం కృషి చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నారు.అందోల్ నియోజకవర్గానికి చరిత్రలో ఎవ్వరూ కేటాయించనన్ని నిధులు తీసుకొస్తూ అవసరమైతే ఇంకా నిధులు కేటాయించేందుకు కృషి చేస్తున్న విజనరీ లీడర్ మంత్రి దామోదర్ రాజనరసింహకు నియోజకవర్గం ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు...

## బిజెపి బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: నౌబాద్ జగన్



**జహీరాబాద్, జూలై 20 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ టౌన్-2 భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి టౌన్-2 ఇన్‌చార్జి నౌబాద్ జగన్ హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, బూత్ కమిటీల పటిష్ఠత, రానున్న పార్టీ కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

టౌన్-2 అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంతపూర్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి టేకూరి వెంకటేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శులు ప్రేమ్, పరశురామ్, 10వ వార్డు ఇన్‌చార్జి నందు స్వామి, టౌన్-2 కార్యవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి అవసరమైన పలు కీలక నిర్ణయాలు తీసుకుని, రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేయాలని తీర్మానించారు.

## మూడు రోజుల ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి విద్య అధికారి బి అశోక్




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 20(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి మండల విద్యాధికారి బి అశోక్ మర్పల్లి మండలంలో ఇంటిగ్రేటెడ్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్నీ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యారంగంలో ఎప్పటికప్పుడు నూతన పోకడలను వృత్యాంతర శిక్షణ కాలంలో తెలుసుకొని క్షేత్రస్థాయిలో పాఠశాల లోని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు ఈ కార్యక్రమంలో పట్లూరు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ వేదావ్రత్, మరియు కాల్ ఖోడ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణయ్య , మరియు జడ్పిహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామేశ్వర్ , పాల్గొన్నారు మరియు ఆర్ పి లు కేశవులు , రమేష్ , రవి , పవన్ కుమార్ మరియు సి ఆర్ పి మల్లేశం, ఉపాధ్యాయులు పాలుగోన్నారు



## ప్రజావాణి వినతులపై తక్షణ చర్యలు తీసుకోండి: కలెక్టర్ ప్రజావాణిలో 84 అర్జీలు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 20:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 84 అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వొద్దని, ప్రతి అర్జీపై బాధ్యతతో స్పందించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com